సాక్షి అనంతపురం

మంగళవారం । 18 । జూన్ । 2024



చీనీ టన్ను రూ.33 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠ ధర రూ.33 వేలు పలికాయి.



కలబంద సాగుతో కాసులు

కూడేరుకు చెందిన రైతు రమేష్ కలబంద సాగు చేపట్టి లాభాలు గడిస్తున్నాడు. ఆదర్శంగా నిలుస్తున్నాడు.

8లో

గరిష్ఠం/కనిష్ఠం 36.6°/23.1°

జిల్లా అంతటా సోమవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్క పోత నెలకొంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

ఇబ్బందుల్లేకుండా ఆయకట్టుకు నీరు



కోతకు గురైన కాలువ గట్టును పరిశీలిస్తున్న హెచ్చెల్సీ అధికారులు

బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి వచ్చే సాగునీటిని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆయకట్టుకు అందిస్తామని హెచ్చెల్సీ చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎస్‌ఈ రాజశేఖర్‌తో కలిసి తుంగభద్ర ఎగువ కాలువ (హెచ్చెల్సీ)ను పరిశీలించారు. 181 కిలోమీటర్ జీబీసీ, ఉంతకల్లు 112 కిలోమీటర్ వద్ద పడిన గండిని, 119 కిలోమీటర్ చెర్లోపల్లి వద్ద కోతకు గురైన కాలువ గట్టు యూటీ ఛానళ్లను పరిశీలించారు. అత్యవసర మరమ్మతుల కింద రూ.50 లక్షలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు సీఈ తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. 119 కిలోమీటర్ వద్ద దెబ్బతిన్న యూటీ ఛానల్‌కు రూ.30 లక్షలు, 112 కిలోమీటర్ వద్ద దెబ్బతిన్న కాలువ గట్టుకు రూ.10 లక్షలు, 181 కిలోమీటర్ జీబీసీ వద్ద దెబ్బతిన్న పనులకు రూ.8 లక్షలు అవసరమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఈఈ రమణారెడ్డి, డీఈ మద్దిలేటి పాల్గొన్నారు.

63 సీట్లు.. 1,301 దరఖాస్తులు

- బీసీ గురుకులాల్లో మిగులు సీట్లకు తీవ్ర పోటీ
- ఈనెల 20, 21 తేదీల్లో రాత పరీక్ష

అనంతపురం ఎడ్యుకేషన్: నాణ్యమైన బోధనతో పాటు అన్ని రకాల వసతులు కల్పిస్తుండడంతో బీసీ గురుకుల పాఠశాలల్లో సీట్లకు తీవ్ర పోటీ నెలకొంది. ఉమ్మడి జిల్లాలో 2024–25 విద్యా సంవత్సరం 6,7,8,9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి వచ్చిన దరఖాస్తులు పరిశీలిస్తే పోటీ ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. 63 సీట్లకు ఏకంగా 1,301 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. నార్పల బీసీ గురుకుల పాఠశాలలో ఈనెల 20, 21 తేదీల్లో రాత పరీక్ష నిర్వహించనున్నారు. 20న 6,8 తరగతులకు, 21న 7,9వ తరగతులకు పరీక్ష ఉంటుంది. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. అధికారిక వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న తరగతే కాకుండా పూర్వపు తరగతి పాఠ్యాంశాలపై కూడా ప్రశ్నలుంటాయి. 100 మార్కులకు రాత పరీక్ష ఇంగ్లిష్ మీడియంలో ఉంటుంది. జవాబులను ఓఎంఆర్ షీట్‌లో గుర్తించాలి. పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని బీసీ గురుకుల పాఠశాలల జిల్లా కన్వీనర్ పీఎంకే సంగీతకుమారి పేర్కొన్నారు. వివరాలకు 9000861117 నంబర్‌లో సంప్రదించవచ్చు.

తేలికపాటి వర్షసూచన

అనంతపురం అగ్రికల్చర్: రాగల రెండు రోజులూ తేలికపాటి వర్షసూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సహదేవరెడ్డి, వాతావరణ విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. రాగల రెండు రోజులూ జిల్లాలో అక్కడక్కడా 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందన్నారు. అలాగే మోస్తరు నుంచి తేలిక పాటి వర్షసూచన ఉన్నట్లు తెలిపారు.

అంతర్జాతీయ సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎంపిక



ఆరోనా రోనాల్డిన్ హో

గుంతకల్లు: పట్టణానికి చెందిన ఆరోనా రోనాల్డిన్ హో అంతర్జాతీయ స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ దారం నవీన్‌కుమార్, అధ్యక్షుడు వల్లే శ్రీనుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 23 వరకూ దక్షిణ కొరియాలోని ఇంచియాన్‌లో పోటీలు జరుగుతాయన్నారు. సోమవారం జట్టు సభ్యులతో ప్రత్యేక విమానంలో ఆరోనా రోనాల్డిన్ హో బయలుదేరినట్లు వెల్లడించారు. కాగా, ఆరోనా రోనాల్డిన్ హో తండ్రి శేఖర్ గుంతకల్లులోని మోదీనాబాద్‌కు చెందిన విద్యుత్ శాఖలో పని చేస్తున్నాడు. రోనాల్డిన్‌లో ప్రతిభను గుర్తించిన ఆయన సాఫ్ట్ టెన్నిస్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పించాడు. దీంతో రోనాల్డిన్ తాను పాల్గొన్న ప్రతి పోటీలోనూ సత్తా చాటుతూ వచ్చాడు. ఈ క్రమంలోనే అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన రోనాల్డిన్‌ను పలువురు అభినందించారు.

త్యాగమయ జీవితమే సార్థకం



ఈద్‌ముబారక్ చెప్పుకుంటున్న చిన్నారులు

త్యాగమయ జీవితమే సార్థకమని ముస్లిం మతపెద్దలు తెలియజేశారు. జిల్లావ్యాప్తంగా సోమవారం బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చిన్నారులు, పెద్దలు పరస్పరం ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ఈద్గా మైదానాల్లో సామూహిక ప్రార్థనలు జరిగాయి. మతపెద్దలు బక్రీదు పర్వదిన విశిష్టతను వివరించారు. భగవంతుడిని మెప్పించి అంతులేని త్యాగంతో సుఖమయ జీవితాలను పొందిన స్ఫూర్తిదాయక కథలను తెలియజేశారు. రాజకీయ నాయకులు, శ్రేయోభిలాషులు ఈద్గా మైదానాలకు వెళ్లి ముస్లింలకు పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

– అనంతపురం కల్చరల్/ సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



అనంతపురం ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రాయదుర్గంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కాసులు కొట్టు.. ఎఫ్‌సీ పట్టు

- అనంతపురంలోని ఓ కార్పొరేట్ విద్యాసంస్థకు నాలుగు స్కూల్ బస్సులున్నాయి. అనేక సంవత్సరాలుగా వాటిని నడుపుతున్నారు. స్కూల్ పిల్లలకు సంబంధించినవి కావడంతో కొత్త బస్సులు అవసరం లేదని సదరు యాజమాన్యం భావిస్తోంది. బస్సుల ఇంజిన్ కండీషన్ సరిగా లేకున్నా నడుపుతున్నారు. ఎఫ్‌సీ సమయంలో అధికారులకు మామూళ్లు ముట్టజెప్పి సర్టిఫికెట్లు తీసుకుంటారు.



- అనంతపురం నగరానికి చెందిన శ్రీనివాసులు అనే వ్యక్తి ఐచర్ వాహనాలు నడుపుతున్నాడు. ఇటీవల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అన్నీ సక్రమంగా ఉన్నా అధికారులు తిరస్కరించారు. తర్వాత ఏజెంట్ ద్వారా వెళ్లగా, వాహనానికి ఎఫ్‌సీ మంజూరు చేశారు. రూ. 7 వేలకు పైగా ఖర్చు వచ్చిందని సదరు వాహన యజమాని తెలిపారు.

- వాహనాలు కండీషన్‌లో లేకున్నా ఫిట్‌నెస్ సర్టిఫికెట్
- ఆర్టీఏ అధికారుల చేతివాటం
- రోజూ జేబుల్లో రూ.వేలు వేసుకుంటున్న వైనం
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు



అనంతపురం సెంట్రల్: వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు మంజూరు చేయడంలో ఆర్టీఏ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వాహనాలు కండీషన్‌లో లేకపోయినా పత్రాలు మంజూరు చేస్తున్నారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో అధికారులు రూ. లక్షలు అక్రమంగా ఆర్జిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అనేక సంవత్సరాలుగా ఇదే తంతు నడుస్తున్నా ఆర్టీఏ ఉన్నతాధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

తప్పిదాలతో పూడ్చలేని నష్టం..

రహదారి ప్రమాదాలను అరికట్టేందుకు ఏటా వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు మంజూరు చేస్తారు. వాహనాలు కండీషన్‌లో ఉంటేనే ఎఫ్‌సీ మంజూరు చేయాలి. ఫిట్‌గా లేని వాహనాలు రహదారులపై ప్రయాణిస్తే రోడ్డు ప్రమాదాల బారిన పడాల్సి వస్తుంది. రవాణాశాఖ అందిస్తున్న సేవల్లో ఈ ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు మంజూరు చేయడం కీలకం. ఇక్కడ ఏదైనా తప్పిదాలకు తావిస్తే పూడ్చలేని నష్టాన్ని చవిచూడాల్సి వస్తుంది.

ఒక్కో వాహనం నుంచి రూ. 7 వేల వరకూ..

జిల్లా కేంద్రంలోని ఆర్టీఏ కార్యాలయానికి రోజూ సగటున 30 వాహనాలు వస్తున్నాయి. ప్రస్తుతం స్కూల్ బస్సులు అదనంగా వస్తుండడంతో ఎఫ్‌సీల కోసం వాహనాలు బారులు తీరుతున్నాయి. ఈ క్రమంలోనే ఫిట్‌నెస్ పరీక్షలు అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. ఒక్కో వాహనానికి ఒక్కో రేటు ఫిక్స్ చేసి వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. ప్రతి వాహనానికి రూ. 5 వేల నుంచి రూ. 7 వేల వరకూ వసూలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. అడిగిన మేరకు ఇవ్వకపోతే నిర్దాక్షిణ్యంగా ఫెయిల్ చేస్తున్నారు. అదే సందర్భంలో కాసులు ముట్టజెబితే వాహనాలు కండీషన్‌లో లేకపోయినా, నిబంధనలు పాటించకపోయినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిబంధనలు అమలు చేస్తున్నాం



వాహనాల ఫిట్‌నెస్ విషయంలో ప్రభుత్వ నిబంధనలు తూచా తప్పకుండా అమలు చేస్తున్నాం. కాలం చెల్లిన వాహనాలు అనే ప్రస్తావన లేదు. లైఫ్‌టైమ్ గడువు ఉంటేనే ఎఫ్‌సీ మంజూరు చేస్తాం. కండీషన్ కూడా తప్పకుండా పరిశీలిస్తున్నాం. ఎక్కడైనా తప్పిదం జరిగినట్లు తెలిస్తే మా దృష్టికి తీసుకురావాలి. వెంటనే విచారించి చర్యలు తీసుకుంటాం.

– వీర్రాజు, ఉప రవాణా కమిషనర్

స్కూల్ బస్సుల నుంచే రూ. లక్షలు..

జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రైవేటు స్కూళ్లకు సంబంధించి 732 బస్సులున్నాయి. విద్యార్థుల రాకపోకలకు వీటిని వినియోగిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఈ బస్సులకు ఎఫ్‌సీలు చేసుకోవాలి. ఎక్కువ శాతం బస్సులకు ఏప్రిల్, మే నెలల్లో ఎఫ్‌సీలు చేసుకుంటారు. జూన్‌లో బడులు పునఃప్రారంభం కావడంతో ఆ సమయానికి కల్లా ఎఫ్‌సీలు పూర్తి చేసుకుంటారు. జిల్లాలో దాదాపు 85 శాతం బస్సులకు ఇప్పటికే ఎఫ్‌సీలు పూర్తి చేసుకున్నారు. సరైన కండీషన్ లేకున్నా సర్టిఫికెట్లు అందిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. రూ. లక్షల్లో స్కూల్ బస్సుల నుంచి వసూళ్లకు పాల్పడినట్లు తెలుస్తోంది. ప్రతి సంవత్సరం ఇదే తంతు జరుగుతున్నా అక్రమాలను అరికట్టడంలో ఉన్నతాధికారులు విఫలమవుతున్నారు.

యువకుడి దారుణ హత్య

- పండుగ పూట ముస్లిం కుటుంబంలో విషాదం



ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ జనార్దన్‌నాయుడు

తాడిపత్రి అర్బన్: ఇంటి మిద్దెపై నిద్రిస్తున్న ఓ ముస్లిం యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన తాడిపత్రి పట్టణంలో సంచలనం రేపింది. ఎంతో సంతోషంగా పండుగ జరుపుకోవాల్సిన ఆ ఇంట్లో విషాదం నెలకొంది. డీఎస్పీ కె.జనార్దన్ నాయుడు తెలిపిన మేరకు.. నందలపాడుకు చెందిన యల్లనూరు లాల్‌బాషా (23) నాపరాళ్ల పరిశ్రమలో మెకానిక్‌గా పని చేస్తుండేవాడు. ఎప్పటిలాగే లాల్‌బాషా ఆదివారం రాత్రి తన ఇంటి మిద్దెపై నిద్రించేందుకు వెళ్లాడు. సోమవారం ఉదయం 6 గంటల సమయంలో మృతుడి నాయనమ్మ అలీమా వచ్చి చూడగా రక్తపు మడుగులో కనిపించాడు. దీంతో ఆమె గట్టిగా కేకలు వేయడంతో ఇంట్లో ఉన్న లాల్‌బాషా తల్లిదండ్రులు షేక్ మహ్మద్, రమీజా, సోదరుడు షేక్ ఇమామ్ హుసేన్‌లు వచ్చి బోరున విలపించారు. సమాచారంతో డీఎస్పీ కె.జనార్దన్‌నాయుడు, సీఐ నాగేంద్ర ప్రసాద్‌లు హుటాహుటిన ఘటనా స్థలిని పరిశీలించారు. రాడ్లతో తలపై దాడి చేయడంతో లాల్‌బాషా అక్కడిక్కడే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి సోదరుడు షేక్ ఇమామ్ హుసేన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ తెలిపారు. లాల్‌బాషా మూడు కేసుల్లో నిందితునిగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులతో మేలు

- ఎడారీకరణను రైతులు తిప్పికొట్టాలి
- కలెక్టర్ వినోద్ కుమార్



చిరుధాన్య పంటల గురించి కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వివరిస్తున్న మల్లారెడ్డి

రాప్తాడు: జిల్లా నుంచి కరువును పారదోలేందుకు రైతులు సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. మండలంలో ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని ఆర్డీటీ అంధుల పాఠశాలలో సోమవారం యాక్షన్ ఫెటర్నా ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రపంచ కరువు–ఎడారీకరణ నివారణ దినోత్సవంలో' కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలాలను శోధించినప్పుడే రైతులకు ఉపశమనం లభిస్తుందన్నారు. వ్యవసాయానికి వాన నీటిపై మాత్రమే ఆధారపడరాదన్నారు. భూములను బీడుగా ఉంచుకోకుండా, ఎడారీకరణను తిప్పి కొట్టేందుకు కనీసం పశుగ్రాసమైనా పొలాల్లో సాగు చేయాలన్నారు. రైతుల సంక్షేమానికి పాటుపడుతున్న ప్రభుత్వేతర సంస్థలకు అన్ని సహాయ సహకారాలు అందిస్తామన్నారు. నీటి సంరక్షణ ఆవశ్యకతపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ మల్లా రెడ్డిని అభినందించారు. మల్లా రెడ్డి మాట్లాడుతూ పంటల సాగులో పురుగు మందుల వాడకం రోజురోజుకూ పెరుగుతోందని, దీంతో పెట్టుబడులు పెరిగి దిగుబడులు రాక రైతులు నష్టపోతున్నారన్నారు. పురుగు మందులు విచక్షణారహితంగా వాడడం వల్ల పర్యావరణం కూడా విషతుల్యమవుతోందన్నారు. అలాంటి సేద్యానికి స్వస్తి పలకాలన్నారు. వేరుశనగ, వరి పంటలు కాకుండా, చిరుధాన్యాలైన కొర్ర, జొన్న, పెసర, ఉలవ, ఆముదం, కంది, అలసంద తదితర పంటలను సాగుచేసి అధిక దిగుబడులు సాధించాలన్నారు. సేంద్రియ వ్యవసాయం పెరిగితే రాష్ట్రంలో పాడి పరిశ్రమ సైతం అభివృద్ధి చెంది రైతుల ఆదాయ మార్గాలు పెరుగుతాయని వివరించారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించే పాలేకర్ విధానాలను పాటించాలన్నారు. ప్రతి రైతు సేంద్రియ, సుస్థిర వ్యవసాయ పద్ధతులను పాటించాలన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి వినీత్ కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతుకూ తమ పొలాల సరిహద్దుల్లో నాటుకునేందుకు 100 మొక్కలు ఉచితంగా అందజేస్తామని తెలిపారు. టేక్, మహాగని, గంధం చెట్లు, ఎర్ర చందనం, చింత మొక్కలు అటవీ శాఖ నర్సరీల్లో అందుబాటులో ఉన్నాయని, రైతులు తమకు నచ్చిన వాటిని తీసుకెళ్లి నాటుకోవాలని ఆయన సూచించారు. అనంతరం రైతులకు ఉపాధి అవకాశాలు, సుస్థిర, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, డ్రిప్, రెయిన్ గన్స్, ఫారం పాండ్స్, జీవనోపాధులు ఎలా పెంపొందించుకోవాలనే అంశాలపై పలువురు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, రిటైర్డ్ సీఆర్‌ఐడీఏ డీజీ వెంకటేశ్వర్లు, ఏపీఎంఐపీ రఘునాథ రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త సహదేవ రెడ్డి, నీటి సంరక్షణ నిర్మాణాల్లో పని చేస్తున్న పలు ప్రభుత్వేతర సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ విజయం చిరస్మరణీయం



యాత్రగా వెళ్తున్న ఆర్మీ జవాన్లతో కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: కార్గిల్ యుద్ధంలో వీర జవాన్లు అందించిన విజయం చిరస్మరణీయమని కలెక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. స్థానిక పోలీసు శిక్షణ కళాశాలలో సోమవారం 'కార్గిల్ విజయ్ దివస్ రజత్ జయంతి మహోత్సవ్–2024'లో భాగంగా ఆర్మీ అధికారులు చేపట్టిన పాన్ ఇండియా మోటార్ సైకిల్ దక్షిణ ప్రాంత (డీ5 మోటార్ సైకిల్) యాత్రను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూలై 26న కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవాన్ని ఇండియన్ ఆర్మీ జరుపుకుంటుదన్నారు. ఇందులో భాగంగా కార్గిల్ వీరులను స్మరించుకుంటూ ప్రజల్లో దేశభక్తిని నింపేందుకు ఇండియన్ ఆర్మీ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర చేపడుతున్నారని, వచ్చే నెల 26 కల్లా ఈ యాత్ర జమ్మూకశ్మీర్ రాష్ట్రం ద్రాస్‌లో ఉన్న కార్గిల్ మెమోరియల్ చేరుకుంటుందన్నారు. అంతకు ముందు కలెక్టర్‌ను మెమెంటో, కార్గిల్ విజయ్ దివస్ క్యాప్‌తో లెఫ్టినెంట్ కల్నల్ మనోజ్ కుమార్ నాయర్, కెప్టెన్ ఆదర్శ్ జన్నేదా సన్మానించారు. కార్గిల్ ప్రాంతంలో విధులు నిర్వర్తించిన జిల్లాకు చెందిన ఐదుగురు మాజీ సైనికులను కలెక్టర్, ఆర్మీ అధికారులు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప బ్యాడ్జీలతో సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, యాత్ర సమన్వయ అధికారి సుబేదార్ సిద్ధప్ప, మాజీ సైనికులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'పీఎం కిసాన్' విడుదల

- 'రైతు భరోసా' కింద రాష్ట్ర వాటా రూ.20 వేలు ఎప్పుడో?



అనంతపురం అగ్రికల్చర్: పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం మంగళవారం ఈ ఏడాది మొదటి విడతగా రూ.2 వేల ప్రకారం రైతులకు పెట్టుబడి సాయం విడుదల చేయనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నిధులను రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాకు సంబంధించి 2,76,147 మంది రైతులకు రూ.55.23 కోట్ల మేర విడుదల చేయనున్నట్లు తెలిపారు.

చంద్రబాబు రూ.20 వేల హామీ ఎప్పుడో...?

రైతు భరోసా కింద ఇక నుంచి ఏటా రూ.20 వేల పెట్టుబడి సాయం రైతులకు అందించనున్నట్లు ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పి అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు తన హామీపై ఇంకా స్పష్టత ఇవ్వలేదు. చెప్పినట్లుగా రూ.20 వేలు పూర్తి స్థాయి మొత్తాన్ని చంద్రబాబు సర్కారు భరిస్తుందా.. లేదంటే కేంద్ర ప్రభుత్వం ఏటా మూడు విడతలుగా ఇస్తున్న రూ.6 వేలు పోనూ మిగతా రూ.14 వేలు చంద్రబాబు ఇస్తారా అనేది కూడా తేలలేదు. రూ.14 వేల మొత్తాన్ని ఖరీఫ్, రబీ, సంక్రాంతి కింద మూడు విడతలుగా ఎంతెంత ఇస్తారనేది తెలియాల్సి ఉంది. అలాగే కౌలు రైతులు, అటవీ, దేవదాయ భూముల సాగుదారులకు గతంలో మాదిరిగా రాష్ట్ర ప్రభుత్వమే పూర్తి మొత్తాన్ని ఇస్తుందా అనే విషయంపై కూడా స్పష్టత లేదు. గత ఐదేళ్లలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు క్రమం తప్పకుండా జూన్, అక్టోబర్, జనవరి నెలల్లో రైతుల ఖాతాల్లోకి పెట్టుబడి సాయం అందించింది. 'రైతు భరోసా–పీఎం కిసాన్' కింద ఒక్కో రైతుకు ఐదేళ్లలో రూ.67,500 ప్రకారం ఉమ్మడి జిల్లా రైతులకు రూ.3,763.90 కోట్ల సాయం పంపిణీ చేసింది.

నేడు కేవీకేలో రైతు సదస్సు

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం రైతు సదస్సు నిర్వహిస్తున్నట్లు కేవీకే కో ఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి పేర్కొన్నారు. 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి' నిధుల విడుదల సందర్భంగా వారణాసిలో ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగే కార్యక్రమాన్ని రైతులు వీక్షించేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విజయవంతం చేయాలని కోరారు.

రబీ నష్ట పరిశీలనకు కేంద్ర బృందం

- బుధ, గురువారాల్లో ఉమ్మడి జిల్లాలో పర్యటన

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాలో గత రబీలో నెలకొన్న కరువు పరిస్థితులను తెలుసుకునేందుకు బుధ, గురువారాల్లో కేంద్ర బృందం పర్యటించనున్నట్లు వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. బుధవారం అనంతపురం రెవెన్యూ భవన్‌లో సమీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇక్కడే ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ, రైతు సంక్షేమశాఖ జాయింట్ సెక్రటరీ రితేష్‌చౌహాన్ టీం లీడర్‌గా డాక్టర్ కె.పొన్నుస్వామి, సునీల్ దుబేతో కూడిన బృందం తొలిరోజు శ్రీ సత్యసాయి జిల్లాలో, రెండో రోజు ఉరవకొండ, విడపనకల్లు, వజ్రకరూరు, కణేకల్లు మండలాల్లో పప్పుశనగ పంట పొలాలను సందర్శించనున్నట్లు తెలిపారు.



అత్యధిక నష్టం పప్పుశనగకే..

గత రబీలో 37,195 హెక్టార్లలో పంటలు దెబ్బతినడంతో రూ.36.86 కోట్లకు పైగా నష్టం జరిగినట్లు నివేదిక తయారు చేశారు. అత్యధికంగా 34,303 హెక్టార్లలో పప్పుశనగ, ఆ తర్వాత 2,101 హెక్టార్లలో జొన్న, 274 హెక్టార్లలో మినుము, 3.21 హెక్టార్లలో అలసంద, 56 హెక్టార్లలో పెసర, 64 హెక్టార్లలో ఉలవ, 297 హెక్టార్లలో పొద్దుతిరుగుడు, 46 హెక్టార్లలో నువ్వులు, 50 హెక్టార్లలో కుసుమ పంటలు దెబ్బతిన్నాయి.

క్లుప్తంగా

జనావాసంలో మయూరం



ఇంటిపై వాలిన నెమలి

పెద్దపప్పూరు: జనావాసంలోకి రోజూ ఉదయాన్నే ఓ నెమలి వచ్చి స్థానికులకు కనువిందు చేస్తోంది. గత కొన్ని నెలలుగా పెద్దపప్పూరులోని పోలీస్ స్టేషన్ సమీపంలోకి వస్తున్న నెమలి కోసం అక్కడి ఓ ఇంటిపై ప్రత్యేకంగా ఆహారం సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఉదయాన్నే నెమలిని చూసి చిన్నారులు కేరింతలు కొడుతున్నారు.

విద్యుదాఘాతంతో వలస కార్మికుడి మృతి

గార్లదిన్నె: విద్యుత్ షాక్‌కు గురై బిహార్‌కు చెందిన వలస కార్మికుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... బిహార్‌కు చెందిన ప్రకాష్ (22) నాలుగు నెలల క్రితం గార్లదిన్నెకు వలస వచ్చి ఓ సిమెంట్ బ్రిక్స్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం సిమెంట్ బ్రిక్స్‌కు నీరు పట్టేందుకు బోరు మోటార్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కాటికోటేశ్వర క్షేత్రంలో ప్రత్యేక పూజలు

తాడిమర్రి: చిల్లవారిపల్లి సమీపంలోని కాటికోటేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్‌కు వెండి ఆభరణాలతో అలంకరించారు. భక్తులు గదాగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి, ఆలయ ప్రదక్షిణలు చేశారు. కొబ్బరి కాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

విశ్రాంత ఉద్యోగి నిజాయితీ

కదిరి అర్బన్: తనకు దొరికిన సెల్‌ఫోనును రిటైర్డు ఉద్యోగి బాధితుడికి అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. సోమవారం ఉదయం పట్టణంలోని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో పలువురు వాకింగ్ చేయడానికి వచ్చారు. వాకింగ్ చేస్తున్న ఆర్టీసీ రిటైర్డు ఉద్యోగి సుబ్బరాయుడుకు ఒక సెల్‌ఫోన్ దొరికింది. తోటి వాకర్స్‌తో కలిసి ఆ ఫోన్ తలుపుల మండలానికి చెందిన మునిస్వామి అనే ఉపాధ్యాయుడిదని గుర్తించారు. అనంతరం బాధితుడు మునిస్వామికి రిటైర్డు ఉద్యోగి సెల్‌ఫోన్ అందజేశారు. బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

కలబంద సాగుతో కాసుల గలగల

- పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ
- కలబంద మొక్క కేవలం రూపాయే
- కొన్నేళ్ల పాటు పంట కోత



రమేష్ పొలంలో సాగు చేసిన కలబంద



కోసిన కలబంద ఆకులను ఎగుమతికి సిద్ధం చేస్తున్న దృశ్యం

కూడేరు: కలబంద సాగు లాభసాటిగా ఉంటుందంటున్నారు రైతులు. తక్కువ పెట్టుబడితో కలబంద సాగు చేపడితే దీర్ఘకాలికంగా లాభాలు గడించవచ్చునంటున్నారు. కూడేరుకు చెందిన రైతు రమేష్ తనకున్న ఎకరా విస్తీర్ణంలో కలబంద సాగు చేపట్టి లాభాలు గడిస్తున్నాడు. ఏడాదికి నాలుగు సార్లు పంట కోతకు వస్తుంది. హైదరాబాదు, బెంగళూరుకు చెందిన పలు కంపెనీల వారు నేరుగా పొలం వద్దకే వచ్చి పంట కొనుగోలు చేస్తున్నారు. కోత కోసినందుకు కూలీలకయ్యే ఖర్చును కూడా వారే భరిస్తున్నారు.

బంధువు సూచనతో...

కొన్నేళ్ల క్రితం తన సమీప బంధువు సూచన మేరకు కలబంద సాగు చేపట్టాలనుకున్న రమేష్ విషయాన్ని వెంటనే స్థానిక వ్యవసాయాధికారితో చర్చించాడు. దీనిపై పరిశీలన అనంతరం వ్యవసాయాధికారి సూచన మేరకు పంట సాగు చేపట్టాడు. ఎలాంటి తెగుళ్లు ఆశించకపోవడంతో పెట్టుబడుల భారం గణనీయంగా తగ్గింది. డ్రిప్ ఏర్పాటు చేయడంతో ఉన్న కొద్దిపాటి నీటి వనరులతోనే పంట సాగు చేశాడు. పది నెలల తర్వాత తొలి పంట చేతికి వచ్చింది. అప్పటి నుంచి ప్రతి మూడు నెలలకు ఒకసారి పంట కోతకు వస్తుండడంతో లాభాలు చవిచూస్తూ వచ్చాడు. హైదరాబాద్, బెంగళూరులో సౌందర్య సాధనాలు ఉత్పత్తి చేసే కంపెనీల నిర్వాహకులు నేరుగా కూడేరుకే వచ్చి పంట కొనుగోలు చేస్తుండడంతో మార్కెట్‌కు తరలించే భారమూ తగ్గింది.

ఇసుక నేలలు అనుకూలం..

అన్ని రకాల నేలల్లోనూ పెరిగే కలబందకు ఇసుక నేలలైతే చాలా అనుకూలమని వ్యవసాయాధికారులు అంటున్నారు. నీటి వాడకం తక్కువే అయినా భూగర్భ జలాలు కాస్త ఎక్కువగా ఉండే నేలనే ఎంచుకోవాలని సూచిస్తున్నారు. జూలై నుంచి ఆగస్టు మధ్యలో మొక్కల్ని నాటుకోవాలి. సాగు ఖర్చు విషయానికి వస్తే ఒక హెక్టార్ సాగు చేయడానికి రూ.30వేల వరకు ఖర్చు అవుతుంది. కూలీల ఖర్చు, సాగు ఏర్పాట్లు, పురుగు మందులు అన్నీ కలిపి ఏడాదికి మొత్తం ఖర్చు సుమారుగా రూ.60వేల వరకు ఉంటుంది. హెక్టార్ పొలంలో ఏడాదికి 40 టన్నుల నుంచి 50 టన్నుల దాకా దిగుబడి వస్తుంది. ఆయుర్వేద కంపెనీలు, కాస్మోటిక్, సబ్బుల తయారీ కంపెనీలు కొనుగోలు చేస్తాయి. ఆకులు మందంగా, పెద్దగా ఉంటే.. ఎక్కువ డిమాండ్ ఉంటుంది. అనేక సంస్థలు టన్ను ఆకులకు రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు చెల్లిస్తున్నాయి. ఈ లెక్కన ఏడాదికి రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల దాకా ఆదాయం పొందవచ్చునని వ్యవసాయాధికారులు వివరిస్తున్నారు.

ఎకరాకు 9 వేల మొక్కలు..

కలబంద సాగు చేపట్టాలనుకునే రైతులు ముందుగా పొలాన్ని బాగా దుక్కి చేయాలి. ఎకరాకు 8–10 టన్నుల పశువుల పేడను ఎరువుగా వేయాలి. ప్రతి సంవత్సరం ఎకరాకు అంతే మోతాదు ఎరువును వేస్తుండాలి. ఎకరాకు 9 వేల మొక్కల చొప్పున మొక్కకు మొక్కకు మధ్య అడుగు దూరం, వరుసకు వరుసకు మూడు అడుగులు దూరం ఉండేలా నాటుకోవాలి. ఒక మొక్క విలువ రూపాయి మాత్రమే ఉంటుంది. పంటకు ఎలాంటి తెగుళ్లు ఆశించవు. పంటలో గడ్డి మొలవకుండా చూసుకుంటే చాలు. కలబంద నాటిన తరువాత 10వ నెలలో మొదటి కోత వస్తుంది. ఆ తర్వాత ప్రతి 4 నెలలకు ఒకసారి ఆకులు సేకరించవచ్చు. ఐదేళ్ల తర్వాత మొదట నాటిన మొక్క పక్కన పెరిగే పిల్ల మొక్కలను ఉంచి పాత మొక్కను తొలగించాలి. ఈ పిల్ల మొక్కలు ఎదిగి మరో ఐదేళ్ల పాటు దిగుబడిని అందిస్తాయి.

లాభాలు బాగున్నాయి



ఏడేళ్ల క్రితం తక్కువ పెట్టుబడితో డ్రిప్ ద్వారా కలబంద సాగు చేపట్టాను. గడ్డి పడకుండా ఎప్పటికప్పుడు చూసుకుంటా. మధ్యలో కొనుగోలు చేసేందుకు కంపెనీలు ముందుకు రాకపోవడంతో కొన్ని నెలలు కోతలు నిలిపివేశా. అయినా రూ.6 లక్షలకు పైగా ఆదాయం వచ్చింది. మార్కెటింగ్ బాగా ఉంటే లాభాల పంట పండుతుంది.

– బోగం రమేష్, రైతు, కూడేరు

మైలసముద్రంలో టీడీపీ నాయకుల హల్‌చల్

- వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిపై దాడి
- పరిటాల శ్రీరామ్ అనుచరులమంటూ దుశ్చర్య
- భయంతో గ్రామం వదిలిపోయిన వైఎస్సార్‌సీపీ నేతలు

కొత్తచెరువు: మండలంలోని మైలసముద్రం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత ఇంటిపై టీడీపీ నేతలు దాడికి తెగబడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు... వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా ఉన్న నాయకులు ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజున గ్రామం విడిచి వెళ్లారు. వారు తిరిగి గ్రామానికి చేరుకున్నారనే సమాచారం అందుకున్న స్థానిక టీడీపీ నాయకుల ప్రోద్బలంతో ఆదివారం రాత్రి 12 గంటలకు రాప్తాడు నుంచి రెండు కార్లలో ఆ పార్టీ గూండాలు వచ్చారు. దాదాపు పది మంది స్థానిక ఓ వైఎస్సార్‌సీపీ నేత ఇంట్లోకి చొరబడి హల్‌చల్ చేశారు. మహిళలను భయభ్రాంతులకు గురి చేస్తూ ఇంట్లో సామగ్రిని ధ్వంసం చేశారు. తాము పరిటాల శ్రీరామ్ అనుచరులమని, పోలీసుల వద్దకెళ్లినా విడిచే ప్రసక్తి లేదని, అడ్డు వచ్చిన ఎంతమందినైనా హతమార్చి తీరుతామంటూ హెచ్చరికలు జారీ చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు పలువురు రాత్రికి రాత్రే మళ్లీ గ్రామం విడిచి వెళ్లిపోయారు. టీడీపీ నాయకుల నుంచి తమను కాపాడాలంటూ ఈ సందర్భంగా పలువురు అభ్యర్థిస్తున్నారు. గ్రామ ప్రశాంతతకు భంగం కలిగించేవారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రైలు ప్రయాణికులకు ‘మదద్’

- సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రత్యేక యాప్
- 35 రకాల సేవాలోపాలపై ఫిర్యాదు చేయొచ్చు



పుట్టపర్తి టౌన్: రైలు ప్రయాణంలో ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు రైల్ మదద్ పేరిట కొత్త యాప్‌ను రైల్వే శాఖ అందుబాటులోకి తెచ్చింది. దీని ద్వారా ప్రయాణ సమయంలో 35 రకాల సేవల్లో లోపాలపై ఫిర్యాదు చేయొచ్చు. సమస్యను వివరించడంతో పాటు సంబంధిత ఫొటోనూ అప్‌లోడ్ చేసేలా యాప్‌కు రూపకల్పన చేశారు. ఈ యాప్‌లో ఫిర్యాదు చేసే ప్రయాణికులు రిజర్వేషన్, జనరల్, ప్లాట్‌ఫామ్ టికెట్లలో ఏదో ఒకదానిని తప్పనిసరిగా తెలియజేయాలి. ప్రతి ఫిర్యాదుపై రైల్వే అధికారులు తక్షణమే స్పందించి, పరిష్కారానికి చర్యలు చేపడతారు.

ఏఏ సమస్యలపై ఫిర్యాదు చేయొచ్చు..

రైల్వేస్టేషన్‌లో అపరిశుభ్రమైన వాతావరణం, నీటికొరత, వెయిటింగ్ హాల్‌లో సౌకర్యాలు కొరత, రిజర్వేషన్ చేసినా వెయిటింగ్ జాబితాలో ఉండడం, టీకెతర సిబ్బంది అవినీతి, రైలు సిబ్బంది నిర్లక్ష్యం, దురుసు ప్రవర్తన, అనుమానదస్పద వ్యక్తులు, కదలికలు, వస్తువుల అపహరణ, గొలుసు దొంగతనాలు, కొట్లాటలు, మద్యపానం, మహిళల పట్ల అసభ్యకర ప్రవర్తన, ఆకతాయిల వేధింపులు, మరుగుదొడ్లు... బోగీల అపరిశుభ్రత, నాణ్యతలేని ఆహారం, ప్యాంట్రీ కార్‌లో అపరిశుభ్రత, అధిక ధరలకు అమ్మడం, ఏసీ.. లైట్లు... చార్జింగ్ పాయింట్లు పనిచేయకపోవడం, రైళ్ల రాకపోకల్లో ఆలస్యం తదితర అంశాలపై యాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు.

యాప్ ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలి

గుగూల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి రైల్ మదద్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. వ్యక్తి గత వివరాలు నమోదు చేయడం ద్వారా సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. ఓటీపీ నమోదు చేయగానే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసి యాప్ వినియోగానికి వీలవుతుంది. ఈ యాప్ ద్వారా ప్రయాణికులు తాము ఎదుర్కొంటున్న 35 రకాల సేవాలోపాలపై ఫిర్యాదు చేయొచ్చు. ఆధారాల కోసం ఫొటోలను సైతం యాప్‌లో అప్‌లోడ్ చేయొచ్చు. అలాగే సంబంధిత అంశంపై ఎలాంటి చర్యలు చేపడితే బాగుంటుందో తెలుపుతూ సూచనలూ ఇవ్వొచ్చు. ప్రతి ఫిర్యాదుకు ఓ రిఫరెన్స్ నంబర్ ఉంటుంది. ఈ నంబర్ ఆధారంగా తమ ఫిర్యాదు ఏ స్థాయిలో ఉందో తెలుసుకునే వెసులుబాటూ ఉంది. సమస్య పరిష్కారం కాగానే ఫిర్యాదుదారుకు ఎస్ఎంఎస్, ఈ–మెయిల్ ద్వారా సమాచారం అందజేస్తారు.

ఎంతో ఉపయుక్తం

రైల్ మదద్ యాప్‌పై రైల్వే అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. యాప్‌లో చేసిన ప్రతి ఫిర్యాదు వెంటనే రైల్వే జనరల్ మేనేజర్, డివిజనల్ మేనేజర్‌కు చేరుతుంది. ఫిర్యాదు స్థాయిని బట్టి సంబంధిత విభాగానికి చెందిన ముఖ్య అధికారిని అప్రమత్తం చేస్తారు. సమస్యను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేస్తారు.

చికెన్ పాయా ఇవ్వనందుకే హతమార్చా!

- నేరాన్ని అంగీకరించిన నిందితుడు యేసురాజు
- 24 గంటల్లోనే హత్య కేసులో మిస్టరీని ఛేదించిన పోలీసులు



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

రాయదుర్గం: ‘చికెన్ పాయా (చారు), మద్యం కొనుగోలుకు డబ్బు అడిగా... ఇవ్వలేదు. దీంతో హత్య చేశాను’ అంటూ తాను చేసిన నేరాన్ని పోలీసుల సమక్షంలో నిందితుడు అంగీకరించాడు. రాయదుర్గం పీఎస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను రూరల్ సీఐ ప్రసాద్‌బాబు, డి.హీరేహాళ్ ఎస్ఐ గురుప్రసాదరెడ్డితో కలసి డీఎస్పీ బి.శ్రీనివాసులు వెల్లడించారు. డి.హీరేహాళ్ మండలం మురడి గ్రామంలో ఆదివారం మురుడప్ప హత్యకు గురైన విషయం తెలిసిందే. హతుడి చిన్నమ్మ హరిజన పెన్నక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు 24 గంటలు గడవక ముందే నిందితుడిని గుర్తించి, సోమవారం సాయంత్రం 5 గంటలకు కల్యం బస్టాప్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారణలో వాస్తవాలను నిందితుడు బహిర్గతం చేశాడు. అనాథగా ఉంటున్న మురడప్ప చుట్టుపక్కల ఇళ్లతో పాటు ఆంజనేయస్వామి ఆలయంలో స్వీపర్‌గా పనిచేస్తుండేవాడు. ఆదివారం కావడంతో చికెన్ దుకాణం నిర్వాహకుడి వద్ద కోడి కాళ్లను ఉచితంగా తీసుకున్నాడు.ఆలయానికి దూరంగా ఉండే వంకలో సొంతంగా చికెన్ రసం (పాయా) వండుకుని భోజనం చేస్తుండగా అక్కడికి యేసురాజు చేరుకున్నాడు. చికెన్ చారుతో పాటు మద్యం కొనుగోలుకు డబ్బు కావాలని యేసురాజు అడగడంతో మురడప్ప నిరాకరించాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. ఆ సమయంలో చేతికి అందిన రాయి తీసుకుని మురడప్ప తలపై యేసురాజు మోది హతమార్చాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కాగా, హత్య కేసులో నిందితుడిని 24 గంటల్లోపు అరెస్ట్ చేసిన సిబ్బందిని ఎస్పీ గౌతమి శాలి ప్రత్యేకంగా అభినందించారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను
10th Pass అయ్యి ఉండి, ఫీల్డ్ వర్క్ - Automobiles / FMCG మరియు ఇతర రంగాలలో సేల్స్/మార్కెటింగ్ / కలెక్షన్స్‌లలో కనీసం 3 సం॥ల అనుభవం కలిగి ఉండవలెను. Salary: Rs.30,000/- ల నుండి.
ప్రాంతాలు: అనంతపురం, కళ్యాణదుర్గం, పెనుగొండ, హిందూపూర్, తాడిపత్రి మరియు చుట్టుపక్కల ప్రాంతాలు
ఇంటర్వ్యూ తేది: 21-06-2024 మ॥ 2 గం॥ల నుండి సా॥ 5 గం॥ల వరకు
మేరు ఆటోమొబైల్స్ ప్రై.లిమిటెడ్
పామురాయి గ్రామం, అనంతపురం. ఫోన్: 9849791770

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

B.Pharmacy ADMISSIONS
■ AP EAPCETలో క్వాలిఫైడ్ స్టూడెంట్స్‌కి, B.Pharmacy నందు ఫ్రీ ఎడ్యుకేషన్ + ఫ్రీ హాస్టల్, క్వాలిఫై కానివారికి Only హాస్టల్ ఫీజు, సంప్ర: జి. మురళి, 9030661651, అనంతపురం. [A-1249]

EDUCATION
■ రెగ్యులర్/డిస్టెన్స్/మధ్యలో చదువు ఆపేసిన/ఫెయిల్ అయిన వారికి/ఒకే సంవత్సరంలో పాస్ అయ్యే అవకాశం: 10TH, 12TH, DIPLOMA, BTECH, MTECH, DEGREE, BCA, BBA, MBA, MCA, LLB, BED, DED, LLB, MLT, ANM, DMLT, ANESTHESIA, OT, MPHW: 8686172989. [L-800667]

REAL ESTATE

PLOTS FOR SALE
■ PVKK అగ్రికల్చర్ కాలేజ్ దగ్గర తక్కువ ధరలో డెవలప్‌మెంట్స్‌తో ప్లాట్స్ కలవు. ల్యాండ్స్ కావలెను. మా ఆఫీస్‌కు స్టాఫ్ మరియు మార్కెటింగ్‌కు స్త్రీ / పు కావలెను. సంప్ర : 7997774369. [A-1248]

PLOT FOR SALE
■ బంపర్ ఆఫర్: 5లక్షలకే 3 ప్లాట్లు, 3.50లక్షలకే 2 ప్లాట్లు, 2.00లక్షలకే 1 ప్లాటు. తాడిపత్రి టు గుత్తి హైవే పైన వేములపాడు తర్వాత మోడల్ స్కూలు ఆనుకొని 43 ఎ॥ల సువిశాలమైన వెంచర్‌లో అప్రూవ్డ్ ప్లాట్లు కొనండి. ఉచితంగా ఎస్‌వీఆర్ ఎర్రచందనము పార్కులో మొక్కను పొందండి. సం.ప్ర: 94907 63299. [L-800663]

WANTED
■ ఫ్యాక్టరీలో వాచ్‌మెన్‌గా పనిచేయుటకు భార్యభర్తలు కావలెను. వసతి సదుపాయం కలదు. సంప్ర: 9246365655, అడ్రస్: బైరవనగర్, 3వ క్రాస్, అనంతపురం. [A-165]
■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95026 15217. [M-1185215]
■ ప్రముఖ బ్యాంకు అనుసంధానమైన ఇన్సూరెన్స్ కంపెనీ కొరకు VRS/ రిటైర్డ్ ఎంప్లాయీస్ / గృహిణులకు, టీమ్ లీడర్లుగా అవకాశం కలదు. శాలరీ+ఇతర సదుపాయాలు కలవు. 8828012783. [A-164]
■ Wanted Experienced Female Staff for English and Social subject for Primary Classes (I to V) Nursery, LKG & UKG staff & Admin Staff, to work in Blossoms School, Aravind Nagar, ATP Mob:9030777676. [C-800291]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

టీడీపీ నేతల అక్రమ వసూళ్లపై బీజేపీ నాయకుల ఫిర్యాదు

గోరంట్ల: తమ పార్టీ పేరు చెప్పి కొందరు టీడీపీ నాయకులు అక్రమ వసూళ్లకు తెరలేపారని, దీనిపై తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. బీజేపీ నాయకులు శంకరరెడ్డి, బొట్టు శ్రీనివాసులు తదితరులు మాట్లాడుతూ... వారం రోజుల క్రితం అనంతపురం సంతలో కొనుగోలు చేసిన పశువులను ఓ వ్యాపారి 407 వాహనంలో గోరంట్లకు తరలిస్తుండగా జిల్లా గోసంక్షణ సమితి అధ్యక్షుడు హరిలాల్ నాయక్ అడ్డుకుని పోలీసులకు అప్పగించే ప్రయత్నం చేశారన్నారు. అయితే ఆ సమయంలో గోరంట్ల మండలానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు అడ్డుపడి 407 వాహనంలో తరలిస్తున్న పశువులు రైతులవని నమ్మబలికి పోలీసుల దృష్టికి వెళ్లకుండా చేశారు. అనంతరం పశువుల వ్యాపారితో తాము బీజేపీ నాయకులమని నమ్మించి రూ.20 వేలు అక్రమంగా వసూలు చేసుకున్నారని మండిపడ్డారు. బీజేపీ ప్రతిష్ఠను మంటగలిపిన టీడీపీ నాయకులపై తక్షణమే కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట హిజ్రాల నిరసన



నిరసన తెలుపుతున్న హిజ్రాలు

మడకశిర: స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట హిజ్రాలు సోమవారం నిరసన తెలిపారు. తమకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. వివరాలు... కర్ణాటకలోని పావగడ, మధుగిరి ప్రాంతానికి చెందిన పలువురు హిజ్రాలు మడకశిరకు వచ్చి స్థానికంగా ఉండే హిజ్రాలను కలసి తమ గ్రూపులో చేరాలని కోరారు. ఇందుకు స్థానిక హిజ్రాలు నిరాకరించడంతో వారిపై దాడి చేశారు. దీంతో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నివాసముంటున్న హిజ్రాలు స్థానికులకు సంఘీభావం తెలుపుతూ సోమవారం పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టారు. దాడి చేసిన హిజ్రాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనపై విచారణ చేసి, న్యాయం చేస్తామని పోలీసులు హామీనివ్వడంతో ఆందోళనను విరమించారు.

మాంసం డబ్బు కోసం ఇరువర్గాల ఘర్షణ



గాయపడిన రామగోపాలనాయుడు, కృష్ణమనాయుడు, ధనలక్ష్మి, గుంపును చెదరగొడుతున్న పోలీసులు

గుత్తి రూరల్: మాంసం డబ్బుల కోసం సోమవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుని పలువురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... గుత్తి మండలం రజాపురం గ్రామానికి చెందిన కృష్ణమనాయుడు, ధనలక్ష్మి దంపతులు అదే గ్రామానికి చెందిన రామగోపాలనాయుడుకు రూ.700 మాంసం డబ్బు బాకీ పడ్డారు. సోమవారం ఉదయం కృష్ణమనాయుడు ఇంటికెళ్లి తన డబ్బు చెల్లించాలని రామగోపాలనాయుడు అడిగాడు. ఆ సమయంలో కృష్ణమనాయుడు తమ్ముడు యువరాజు సర్దిచెప్పడానికి ప్రయతిస్తే మాటామాట పెరిగి గొడవ చోటు చేసుకుంది. బంధువులు, ఇళ్ల పక్కన వారు సర్ది చెప్పి పంపడంతో అప్పటికి వివాదం సద్దుమణిగింది. మధ్యాహ్నం రామగోపాలనాయుడు, తన బంధువు దినేష్ నాయుడుతో కలసి వెళుతుండగా పాత గొడవను మనసులో పెట్టుకున్న కృష్ణమనాయుడు, తన వర్గంతో కలసి దాడి చేశాడు. రామగోపాలనాయుడు, దినేష్‌నాయుడు కళ్లలో కారం కొట్టి ఇనుప పైపులతో దాడికి తెగబడ్డారు. విషయం తెలుసుకున్న రామగోపాలనాయుడు వర్గం అక్కడకు చేరుకుంది. ఆ సమయంలో ఇరువర్గాల మధ్య పరస్పర దాడులు చోటు చేసుకున్నాయి. రామగోపాలనాయుడు, దినేష్‌నాయుడు, కృష్ణమనాయుడు, ధనలక్ష్మి గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అదే సమయంలో మరోసారి ఆస్పత్రి వద్ద ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న సీఐ వెంకట్రామిరెడ్డి అక్కడకు చేరుకుని ఇరువర్గాల వారిని చెదరగొట్టారు. అనంతరం పరస్పర ఫిర్యాదుల మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

యువతి అనుమానాస్పద మృతి

ఓడీచెరువు: మండలంలోని చౌడంపల్లి సమీపంలోని చెక్‌డ్యాంలో ఓ యువతి మృతదేహాన్ని సోమవారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి, పరిశీలించారు. మృతురాలిని చౌడంపల్లికి చెందిన వెంకటేష్ కుమార్తె ప్రమీల (16)గా గుర్తించారు. ఫోన్‌లో ఎక్కువగా మాట్లాతుండడంతో ఆదివారం తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఇల్లు విడిచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు గాలింపు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలో సోమవారం ఉదయం 7 గంటలకు చెక్‌డ్యాం వైపుగా వెళ్లిన స్థానికులు... ప్రమీల మృతదేహాన్ని గుర్తించారు. అయితే తలపై బలమైన రక్తగాయాలు ఉండడంతో ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వంశీకృష్ణ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

- గడ్డి కోసం వెళ్లి....



ఆంజనేయులు (ఫైల్)

రాయదుర్గం రూరల్: గడ్డి కోసం వెళ్లిన ఓ వ్యక్తి విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం డి.కొండాపురం గ్రామానికి చెందిన పశువుల ఆంజనేయులు (43)కు భార్య లక్ష్మితో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పొట్టేళ్ల పెంపకంతో జీవనం సాగించే ఆంజనేయులు ఆదివారం ఉదయం 11 గంటలకు పచ్చి గడ్డి కోసం అదే గ్రామంలోని రైతు దుగ్గన్న తోటకు వెళ్లాడు. భార్య లక్ష్మి కూలి పనులకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి చేరుకున్న భార్య... తన భర్త ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వారిని ఆరా తీసింది. పొట్టేళ్లకు గడ్డి తెచ్చేందుకు వెళ్లి ఉంటాడని గ్రహించిన ఆమె తన మరిది, కుమారుడితో కలిసి ఆదివారం రాత్రి 7 గంటలకు దుగ్గన్న తోట వైపు వెళ్లింది. అక్కడ విగత జీవిగా పడి ఉన్న భర్తను గమనించి బోరున విలపించింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. పచ్చి గడ్డి పీకుతున్న సమయంలో అక్కడే ఉన్న శిథిలమైన వ్యవసాయ బోరు విద్యుత్ సర్వీసు వైరును కుడిచేతితో తాకడం వల్ల షాక్ గురై మృతి చెందినట్లుగా నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో రుక్మిణి పాండురంగస్వామి

బొమ్మనహాళ్: ఆంధ్ర పండరీపురంగా ప్రసిద్ధి చెందిన బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు సోమవారం అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పాండురంగస్వామికి తెల్లవారుజామున వేదమంత్రోచ్చారణలతో అభిషేకం నిర్వహించారు. పుష్పాలకరణ, ఆకుపూజ, ప్రత్యేక అలంకరణ చేసి కుంకుమార్చన, మహామంగహారతి తదితర పూజలు చేశారు. విఠల విఠల... రుక్మిణీ పాండురంగ విఠల అంటూ భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొని, స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. తులసీ మాల ధారణకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. అనంతరం అన్నదానం చేశారు. బొమ్మనహాళ్ పాండురంగ స్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు చేశారు.

సారా కిక్కు... బతికించిన లక్కు



సుధాకర్

గుత్తి రూరల్: తెలంగాణలోని హన్మకొండలోని చెరువు ఒడ్డున మృతదేహం లాంటి ఘటనే గుత్తి సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. హన్మకొండలోని చెరువు నీటిలో ఉన్న మృతదేహాన్ని పోస్టుమార్గానికి తరలించాలని చేయి పట్టుకుని ఇలా బయటికి లాగగానే.. చనిపోయాడనుకున్న వ్యక్తి కాస్తా ఒక్కసారిగా పైకి లేచాడు. విచారణలో పీకలదాకా మద్యం సేవించిన తాను చెరువు నీటిలో చల్లగా ఉండడంతో నిద్రించానని చెప్పుకొచ్చాడు. అచ్చం ఇలాంటి ఘటనే గుత్తిలో చోటు చేసుకుంది. వివరాలు... మండలంలోని బసినేపల్లి తండా గ్రామ శివారులో గుత్తి–పెండేకల్లు రైలు మార్గంలో సోమవారం రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ వెళుతున్న వారు పట్టాలపై పడి ఉన్న వ్యక్తిని గుర్తించి సమాచారం ఇవ్వడంతో జీఆర్‌పీ పోలీసులు వాసు, నాగరాజు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఎలాంటి కదలికలు లేకపోవడంతో మృతదేహంగానే భావించి కదిపారు. ఆశ్చర్యంగా శరీరంలో కదలికలు కనిపించాయి. దీంతో వెంటనే గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి, విచారణ చేపట్టడంతో ఆశ్చర్యకరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. గుత్తి మండలం కరిడికొండ గ్రామానికి చెందిన సుధాకర్ కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జి.ఎర్రగుడి గ్రామానికి నాటుసారా సేవించేందుకు వెళ్లాడు. అక్కడ సారా అధికంగా సేవించి రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ వెళ్తూ అదుపు తప్పి కిందకు పడ్డాడు. మత్తులో ఉన్న అతడు కిందకు పడగానే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. అటుగా వెళ్తున్న కొందరు రైతులు గమనించి మృతదేహంగా భావించి జీఆర్‌పీ పోలీసులకు సమాచారమిచ్చారు. చివరకు అసలు విషయం తెలుసుకున్న స్థానికులు, జీఆర్‌పీ సిబ్బంది ‘వీడు మాములోడు కాదురోయ్’ అంటూ వ్యాఖ్యానించారు.

క్లుప్తంగా

జోరుగా పూడికతీత పనులు



39వ డివిజన్‌లో జరుగుతున్న పూడికతీత పనులు

అనంతపురం కార్పొరేషన్: మేయర్ వసీం, కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో నగరంలో పూడికతీత పనులు జోరుగా సాగుతున్నాయి. సోమవారం 39వ డివిజన్ ఎన్‌హెచ్ 44 పెట్రోల్ బంకు వద్ద ఉన్న పెద్ద కాలువలో పూడికతీత పనులు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని జేసీబీల సహాయంతో తొలగించారు. పనులను ఈఈ సూర్యనారాయణ, డీఈ సుభాష్ చంద్రబోస్, వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతకుంట మధు పరిశీలించారు.

స్కియాడ్‌కు నిధులు విడుదల చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: రాష్ట్ర ప్రభుత్వం మెగా డీఎస్సీ విడుదల చేయడం జరిగింది. నిరుద్యోగులకు శిక్షణ ఇచ్చేందుకు స్కియాడ్‌కు నిధులు విడుదల చేసి ప్రారంభించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు సాకే హరి అన్నారు. సోమవారం స్థానిక స్కియాడ్ వద్ద విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలు ఉద్యోగాలకు ఎంపిక కావాలంటే స్కియాడ్ ప్రారంభించి నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వాలన్నారు. ప్రస్తుతం స్కియాడ్ శిథిలావస్థలో ఉందని గుర్తు చేశారు. ఎస్కేయూ వీసీ స్పందించి నిరుద్యోగులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో శివ, రాజశేఖర్, కుమార్, నరేష్, గోపాల్, ధన, తిమ్మప్ప, రామకృష్ణ, ఓబులేసు, ఈశ్వరయ్య, నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పాతూరు మార్కెట్‌లోకి మురుగు



పనులు చేయిస్తున్న డిప్యూటీ మేయర్

అనంతపురం కార్పొరేషన్: పాతూరులో ఓ కల్వర్టు బ్లాక్ కావడంతో కాయగూరల మార్కెట్‌లోకి మురుగు నీరు ప్రవేశించింది. దీంతో వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ విష్ణుమూర్తి వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. మార్కెట్‌లో కాసేపు విక్రయాలు జరపకుండా చర్యలు తీసుకున్నారు. సక్షన్ ఆపరేటర్ ద్వారా మురుగును బయటకు తొలగించారు. అనంతరం నగరపాలక సంస్థ సిబ్బంది కల్వర్టును పగలగొట్టి, మురుగును తీసి, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. దీంతో వ్యాపారులు, ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తిరుపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక



సమావేశమైన పూర్వ విద్యార్థులు

రామగిరి: మండలంలోని పేరూరు డ్యాంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987–88 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 37 సంవత్సరాల అనంతరం పూర్వ విద్యార్థులు ఒకచోట చేరడంతో పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది. ఆనాటి జ్ఞాపకాలు, చిలిపి పనులను ఒకరికొకరు చెప్పుకున్నారు. పరస్పరం యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన పూర్వ గురువులను సన్మానించారు. కార్యక్రమంలో శకుంతల, శైలజ, రామక్క, జమున, పద్మజ, రాజశేఖర్, చంద్రశేఖర్, ఈరంటి సతీష్, సుబ్బయ్య, నారాయణ, గంగాధర్, సిద్ధయ్య, లింగన్న, రంగనాయకులు, తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నెమలి మృతి



మృతి చెందిన నెమలిని అటవీ శాఖ అధికారులకు అప్పగిస్తున్న ఎస్‌ఐ గోపాలుడు

అనంతపురం: నేషనల్ పార్క్ సమీపంలో జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో నెమలి మృతి చెందింది. నెమలి రోడ్డు దాటే క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడిక్కడే చనిపోయింది. సమాచారం అందుకున్న మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ గోపాలుడు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మారెప్ప మృతి చెందిన నెమలిని స్వాధీనం చేసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ఈద్–అల్–అదా



బక్రీద్ శుభాకాంక్షలు చెప్పుకుంటున్న చిన్నారులు



ఆత్మకూరు: సర్దార్‌వలి దర్గాలో దువా చదువుతున్న ముస్లింలు



వజూ చేస్తున్న దృశ్యం

అనంతపురం, రాప్తాడు నియోజకవర్గాల్లో సోమవారం బక్రీద్ (ఈద్–అల్–అదా) సందడి నెలకొంది. పలు మసీదులు, ఈద్గా మైదానాల్లో సామూహిక ప్రార్థనలు జరిగాయి. అధికార, అనధికార ప్రముఖులు పాల్గొని ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. రాప్తాడు మండలంలోని పలు గ్రామాల ముస్లింలు రాప్తాడులోని మసీదుకు చేరుకుని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 8:30 గంటలకు మతపెద్దలు ప్రార్థనలను ప్రారంభించారు. బక్రీద్ పర్వదిన విశిష్టతను మౌలనాలు వివరించారు. హజరత్ ఇబ్రహీం చేసిన మహోన్నత త్యాగం మానవాళికి గొప్ప సందేశాన్ని అందించిందని గుర్తు చేశారు. జ్ఞాపకార్థం వారి త్యాగ నిరతిని గుర్తు చేసుకోవడం అందరి విధి అన్నారు. అన్ని మతాల మధ్య సయోధ్య, సహకార భావనను బక్రీద్ తెస్తుందన్నారు. అనంతరం ముస్లింలు ఒకరినొకరు అలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఖుర్బానీని ప్రారంభించి బంధువులు, మిత్రులకు మాంసాహారం పంచిపెట్టారు. పేదలకు వస్త్రాదానంతో పాటు తోచిన సాయం అందజేశారు. తోటి మిత్రులు, బంధువులను ఇళ్లకు ఆహ్వానించి విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఆత్మకూరులోని సయ్యద్ సర్దార్ వలి దర్గాలో బక్రీద్ సందర్భంగా ప్రార్థనలు జరిగాయి. ప్రజలు సంతోషంగా ఉండాలని, పంటలు బాగా పండాలని దువా చేశారు. ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలన్నదే బక్రీద్ పండుగ ముఖ్య సందేశమని హజరత్ షబ్బీర్ తెలియజేశారు. ఆత్మకూరులో జామియా మసీదు నుంచి ముస్లింలు ఈద్గా వద్దకు చేరుకుని నమాజ్ చేశారు. అలాగే ముట్టాల, సనప, తోపుదుర్తి గ్రామాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మామిళ్లపల్లిలోని ఈద్గా మైదానంలో జరిగిన సామూహిక ప్రార్థనల్లో చుట్టు పక్కల గ్రామాల నుంచి వందలాది ముస్లింలు పాల్గొన్నారు. త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ విశిష్టతను మత పెద్దలు తెలిపారు.

– అనంతపురం కల్చరల్/రాప్తాడు/ఆత్మకూరు/కనగానపల్లి:



ఆత్మకూరు: బక్రీద్ ప్రాముఖ్యతను తెలియజేస్తున్న హజరత్ షబ్బీర్



అనంతపురం హౌసింగ్ బోర్డులోని ఈద్గాలో..



రాప్తాడులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



ప్రార్థనలకు వచ్చిన చిన్నారులు

రక్తదాన శిబిరం చేపట్టడం హర్షణీయం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న మేయర్ వసీం, అనంత చంద్రారెడ్డి తదితరులు

అనంతపురం కల్చరల్: పరమతసహనం మన నినాదం. రక్తదానం మన విధానం కావాలి. రక్తదానం చేసే ప్రతి వ్యక్తి మరొకరి ప్రాణాలు కాపాడినట్లే అని మేయర్ వసీం సలీం కొనియాడారు. సోమవారం స్థానిక షాహీ ఈద్గా మైదానంలో బక్రీద్ పర్వదినం సందర్భంగా స్వచ్ఛంద రక్తదాన శిబిరం జరిగింది. దాదాపు 81 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మేయర్ వసీంతో పాటు ఆత్మీయలుగా విచ్చేసిన వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, మానవత రక్తదాతల సంస్థ కన్వీనర్ తరిమెల అమరనాథరెడ్డి, కో–కన్వీనర్ సలీం మాలిక్ తదితరులు మాట్లాడారు. గత పాతికేళ్లుగా సలీం మాలిక్, నజీర్ మిత్ర బృందం బక్రీద్ రోజున వందలాదితో కలిసి రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. మత సామరస్యం ఉట్టిపడేలా అన్ని కుల మతాల వారు రక్తదానం చేయడంతో పండుగకు ప్రత్యేక కళ వచ్చిందన్నారు. కరోనా సమయంలో కూడా మానవతా సంస్థ తరిమెల అమరనాథరెడ్డి తమ మిత్ర బృందాలతో స్ఫూర్తిదాయకంగా రక్తదానం చేయించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కళలను ప్రోత్సహించాలి



తాము గీచిన చిత్రాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

అనంతపురం కల్చరల్: నగరంలోని ఆదర్శ స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సోమవారం లలితా కళా ఉత్సవాల ముగింపు వేడుక సందడిగా జరిగింది. స్థానిక పీస్ మెమోరియల్ హాలు వేదికగా చివరి రోజు చిత్రకళ, నృత్యకళ, సంగీతం, చదరంగం, హ్యాండ్ రైటింగ్ తదితర వాటిల్లో అపార ప్రతిభతో చిన్నారులు ఆకట్టుకున్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన పురావస్తు శాఖ ఏడీ రజిత, సీఐ జాకీర్ మాట్లాడారు. చిన్నారులను అద్భుతంగా సృజనకారులుగా తీర్చిదిద్దుతున్న చిత్రకళా మాస్టర్ వినోద్‌కుమార్ కృషిని అభినందించారు. తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సహిస్తున్నందు వల్లే ఇంతమంది తమలోని ప్రతిభను చాటుకునే అవకాశం వచ్చిందన్నారు. తల్లిదండ్రులు పిల్లల్లోని కళలను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ట్ మాస్టర్ అజయ్, భార్గవ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తొలి ఏకాదశి పూజలు



అలంకార సేవల్లో మంజునాథ అన్నపూర్ణేశ్వరుడు



పూజలందుకున్న రుక్మిణీ విఠల పాండురంగడు

అనంతపురం కల్చరల్: విష్ణుమూర్తి యోగనిద్రకు ఉపక్రమించే పవిత్ర దినంగా భావించే తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం నగరంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. నగరంలోని హెచ్చెల్సీ కాలనీలోని అన్నపూర్ణ మంజునాథేశ్వరాలయంలో ప్రధాన అర్చకుడు బసవరాజ స్వామి ఆధ్వర్యంలో తొలి ఏకాదశి పూజలు చేపట్టారు. ఉదయం మహా రుద్రాభిషేకం, భస్మార్చన, రుద్రం, చమకం పఠనం భక్తిశ్రద్ధలతో జరిగాయి. సోమవారం కలిసి రావడంతో తీర్థప్రసాదాలతో పాటూ అన్నదానం నిర్వహించారు. రామనగర్‌లోని భవసార క్షత్రియ రుక్మిణీ పాండురంగ విఠల స్వామి ఆలయంలో తెల్లవారుజామున నుంచే తొలి ఏకాదశి సందర్భంగా వందల సంఖ్యలో భక్తులు బారులు తీరి దేవతామూర్తులను దర్శించుకున్నారు. నిజపాద స్పర్శ దర్శనం ఏర్పాటు చేయడంతో భక్తులు స్వయంగా మూల విరాట్టును తాకి పూజలు చేశారు. అలాగే ఇస్కాన్ గోశాల, వేణుగోపాల స్వామి ఆలయం, లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం, బాబా మందిరం తదితర చోట్ల భక్తుల సందడి నెలకొంది.



స్వామి దర్శనానికి బారులుతీరిన భక్తులు

ఎడారి నివారణ పథకాలు అమలు చేయాలి



కలెక్టర్‌కు సమస్యలు విన్నవిస్తున్న రైతు సంఘం నాయకుడు టి.సి.నారాయణ రెడ్డి

రాప్తాడు: ప్రతి ఏడాది జూన్ 17న ఎడారి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఐక్యరాజ్య సమితి సదస్సు ఏర్పాటు చేయడం హర్షణీయమని రైతు సంఘం నాయకుడు టి.సి.నారాయణ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని ఆర్డీటీ అంధుల పాఠశాలలో యాక్షన్ ఫ్రెటర్నా ఎకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో ప్రపంచ కరువు–ఎడారీకరణ నివారణ సదస్సు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్‌ను కలిసి జిల్లాలో ఎడారి నివారణ పథకాలు అమలు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. ఉమ్మడి అనంత జిల్లాలో గత నాలుగైదేళ్లుగా కరువు పరిస్థితులు వల్ల రైతులు పంటలు సాగు చేయం బీడు భూములుగా మారుతున్నాయన్నారు. రాయదుర్గం, కణేకల్లు, కళ్యాణదుర్గం ప్రాంతాల్లో ఇసుక మేటలు ఏర్పడి నిలువున పచ్చని చెట్లు ఎండిపోతున్నాయని తెలిపారు. గత ఏడాది తీవ్ర కరువుతో వర్షాలు రాక 50 శాతం మంది రైతులు పంటలు సాగు చేయక తమ పొలాలను బీడు భూములుగా వదిలి వేయడం జరిగిందన్నారు. జిల్లాలో ఎడారి నివారణకు 40 టీఎంసీల సామర్థ్యం గల హంద్రీ నీవా ప్రాజెక్టును అమలు చేయాలన్నారు. హంద్రీ–నీవా సుజల స్రవంతి ప్రాజెక్టు కాలువను వెడల్పు చేయాలన్నారు. ఎడారి జిల్లాలో హంద్రీ–నీవా ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి జిల్లాలోని నాలుగు జలాశయాలు జీడిపల్లి, గొల్లపల్లి, నూరీల, చెర్లోపల్లి జలాశయాలను పూర్తిగా నింపాలని సూచించారు. పండ్ల తోటలు సాగు చేసుకునే రైతులను ఎక్కువగా ప్రోత్సహిస్తు ఎకరాకు రూ.20 వేల చొప్పున 5 ఎకరాలకు ఉచితంగా ఇవ్వాలన్నారు. నీటి వనరులు ఉన్న చోట చెక్ డ్యాంలు నిర్మించి ప్రతి గ్రామానికి 6 వ్యవసాయ చిన్న ట్రాక్టర్లను ఉచితంగా ఇవ్వాలన్నారు. ఎద్దులు కలిగిన రైతులకు ఉచితంగా దాణా ఇవ్వాలని, ప్రతి రైతు కుటుంబానికి ఇక పాడి ఆవును ఉచితంగా ఇవ్వాలన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం





అలంకరణలో పార్వతి దేవి, నీలకంఠేశ్వర స్వామి



చండీ హోమం చేస్తున్న వేద పండితులు

రాప్తాడు: మండల కేంద్రంలోని స్థానిక నీలకంఠేశ్వర ఆలయ సమీపంలోని పార్వతి దేవి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ దేవి ఆలయ 8వ వార్షికోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా అమ్మవారికి వేద పండితులు సూర్యనారాయణ స్వామి, వాసు దేవ రావు, ఆలయ పూజారి చేడిపోతుల మురళి అధ్యక్షతన ఆకుపూజ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, విశేష అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ తదితర పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా సాగాయి. అలాగే అమ్మవారి ఆలయంలో వేద పండితులతో చండీ హోమం చేయించారు. ఉదయం నుంచి రాత్రి వరకు పార్వతీ దేవి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అదే విధంగా నీలకంఠేశ్వర స్వామి, వినాయకుడికి ఆకుపూజ కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

అనారోగ్యంతో మాజీ విలేకరి మృతి



రమణ (ఫైల్)

రాప్తాడు: మండలంలోని మరూరు గ్రామానికి చెందిన రాప్తాడు మండల మాజీ విలేకరి కట్టెలచెక్కె రమణ (52) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్లితే.. మరూరు గ్రామానికి చెందిన కే.రమణ గత 20 ఎళ్లుగా వివిధ దిన పత్రికల్లో విలేకరిగా పని చేశారు. మండలంలో ప్రజలు, అధికారులు, రైతులతో కలిసి మెలసి ఉండేవాడు. ఎవరికి ఏ సమస్య వచ్చినా తను ముందుండేవాడు. గత కొన్నాళ్లుగా అనారోగ్యానికి గురై, మృతి చెందడంతో మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి. రమణ మృతి చెందాడన్న విషయం తెలియడంతో మండలంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో మూడు గొర్రెలు మృతి



చనిపోయిన గొర్రె

తలుపుల: బండ్లపల్లి పంచాయతీలోని ఎగువ హరిజనవాడ ఉత్తన్నకు చెందిన 3 గొర్రెలు విద్యుదాఘాతంతో సోమవారం మృతి చెందాయి. బాధితుడు తెలిపిన మేరకు... ఊరికి పక్కన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేపుతుండగా మూడు గొర్రెలు విద్యుదాఘాతానికి గురయ్యాయి. ఊరిలో వారు వచ్చి చూడగా అప్పటికే అవి చనిపోయాయని బాధితుడు తెలిపాడు. రూ.60 వేల దాకా నష్టం వాటిల్లిందని వాపోయాడు. ప్రభుత్వం ఆర్థిసాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నాడు.

గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ మృతి



వాల్మీకి రంగప్ప (ఫైల్)

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పని చేస్తున్న బెళుగుప్ప మండలం నరసాపురానికి చెందిన వాల్మీకి రంగప్ప (52) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. కళ్యాణదుర్గం నుంచి కదిరిలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానికి వెళ్తుండగా మార్గమధ్యంలో గుండెపోటు వచ్చింది. దీంతో రంగప్ప ఆర్టీసీ బస్సులోనే గుండె పోటుతో మృతి చెందాడు. స్థానిక ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లు గమనించి ఆసుపత్రికి తరలిస్తుండగా, అప్పటికే రంగప్ప మృతి చెందాడు. ఆర్టీసీ సిబ్బంది ఎవరైనా అకాల మరణం చెందితే అంత్యక్రియలకు రూ.15వేలు ఇవ్వాల్సి ఉంది. అయితే తన భర్త మృతిపై కళ్యాణదుర్గం ఆర్టీసీ డిపో మేనేజర్ నిర్లక్ష్యం చూపుతున్నారని మృతుడి భార్య శివమ్మ వాపోయింది. మృతుడికి భార్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వేరుశనగ పంటకు తెగుళ్లు



అంతరగంగలో తెగుళ్ల బారినపడిన వేరుశనగ పంట

కూడేరు: మండలంలో ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ బోరుబావుల కింద సాగు చేసిన వేరుశనగ పంటకు తెగుళ్ల సోకాయి. మండల వ్యాప్తంగా వ్యవసాయ బోరుబావుల కింద సుమారు 1500 ఎకరాల విస్తీర్ణంలో రైతులు వేరుశనగ సాగు చేశారు. కొర్రకోడు, జల్లిపల్లి, ఉదిరిపికొండ, మరుట్ల, కూడేరు, ఇప్పేరు, కలగళ్ల, అంతరగంగ, కమ్మూరు, ఉదిరిపికొండ తండా, గొటుకూరుతో పాటు మరికొన్ని గ్రామాల్లో వేరుశనగ పంటకు మచ్చ తెగులు సోకింది. లద్దె పురుగు, పచ్చ పురుగులు పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వేరుశనగ పంటలో కలుపు విపరీతంగా పెరిగింది. కలుపు తొలగించడానికి కూలీలకు రూ.వేలు ఖర్చు అవుతోంది. దీంతో ఆకులు రంధ్రాలు పడడం, మచ్చలు ఏర్పడ్డాయి. తెగుళ్ల నివారణకు రైతులు మందు పిచికారీ చేస్తున్నా ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తుండడంతో పురుగు తగ్గుముఖం పట్టలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు, వ్యవసాయాధికారులు స్పందించి తెగుళ్ల బారిన పడిన వేరుశనగ పంటను పరిశీలించి నివారణకు తగు సూచనలు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనంతపురము డివిజన్
9912220719, 9912220732, 9912220724, 9010223702, 9010567770, 9010588846, 9912220727